
- కథ -

# వినోదాల విషవలయం

- పొన్నాడ సత్యప్రకాశరావు



**"త**ల్లి తోడు.. పీక పిసికేస్తా"...

ఓ... ఏం డైలాగ్‌రా!! విజిల్స్... చప్పట్లు.. కాసుల వర్షం.. హాల్ దద్దరిల్లిపోయింది.

ఎందుకో ఏదైనా సినిమా చూడాలనిపించి, రికార్డులు బ్రద్దలుకొడుతున్న "దొంగ నా కొడుకు" సినిమా కొచ్చిన నాకు ఆ డైలాగ్‌లో వున్న గొప్పదనం ఏమిటో అర్థం కాలేదు. హీరో తండ్రిని అతని బావమరిదే చంపేసి ఆస్తి కాజేస్తాడు. హీరో ఎక్కడో రిక్షావాడిగా బ్రతుకుతూ మేనమామ పొగరుబోతు కూతురిని లవ్వాడి ఆఖరున మేనమామ భరతం పడతాడు. తొంభైశాతం తెలుగు సినిమాలకి ఇదే కథావస్తువు. ఉప్పు, కారం ఎట్‌సెట్రా.

ఇంట్రవెల్లో లేచి ఇంటికి వచ్చేసాను. నా మొహాన ఓ కాఫీకప్పు పడేసి, పోయింది శ్రీమతి హడావుడిగా...

'ఏమయిందే... అలా ఉన్నావు' అడిగాను.

'గాయత్రిని హాస్పిటల్లో అడ్మిట్ చేశారండి'

'అరె.. ఎప్పుడు.. ఏమయింది'?

'ఏంటో పాపం.. అన్నీ కష్టాలే గాయత్రికి..

రండి చూద్దాం'.

మా ఆవిడ టి.వీ. ముందర సీరియస్‌గా కూర్చొన్న ప్పటికి గానీ నాకు విషయం అర్థం కాలేదు..

నా మేనకోడలు పేరు గాయత్రి... ఆమెకి ఏమైనా అయిందేమోననుకొని గాభరాపడ్డాను..

మా ఆవిడ చెప్పిన గాయత్రి టి.వి. సీరియల్‌లోని గాయత్రి.

ఆ మధ్యన అలాగే ఉన్నట్టుండి 'కస్తూరిని అరెస్ట్ చేశారండీ' అంది. కంగారు పడ్డాను. మా అన్నయ్య గారి అమ్మాయి పేరు కస్తూరి. ఈవిడ చెప్పేది టీ.వీ. సీరియల్ గురించి..

టీ.వీ సీరియల్స్‌లోని పాత్రలన్నీ తమ దగ్గర బంధువుల్లా వాళ్ళు నవ్వితే నవ్వి, ఏడిస్తే ఏడ్చే నా శ్రీమతి నాకో ప్రోబ్లెమ్.

టీ.వీ. సీరియల్స్‌లో మచ్చుకైనా సాధారణ కుటుంబాలు కనపడవు... పెద్ద పెద్ద బంగళాలు., కళ్ళు చెదిరె పట్టు చీరెలు, ఖరీదైన ఫర్నీచర్, విశాలమైన బెడ్ రూంలు..

వాటన్నింటిని చూసి... చూసి... నన్ను... నా ఇంటిని చూసే శ్రీమతి..., టీ.వీ. మత్తులో మునిగి తేలటం నేర్చుకొంది.

'కంపేరిజన్స్'కి తట్టుకోలేక ఆవిడని ఆ మత్తులోనే ఉండనివ్వటం మంచిదనిపించింది.

టీ.వీ. దుకాణం కట్టేసేవరకు ఆవిడ పనులన్నీ యాంత్రికంగా చేస్తుంది.

నేను వీక్లీ తీసుకొని బెడ్‌రూంలోకి పోయాను.

అదో ప్రముఖ వారపత్రిక.

పేజీలు త్రిప్పాను.

'మంచం సమస్యలు-సమాధానాలు' శీర్షిక క్రింద 'తిమ్మిరి' కి సంబంధించిన వ్యాధుల స్పెషలిస్ట్ డా॥ తిమిరంగారి సమాధానాలు.

'నాకు హస్తప్రయోగం... అలవాటు. నాకు 16 వ సంవత్సరం నుంచీ ఉంది. ఈ మధ్య నా అంగం గట్టిపడటం లేదు. మా ఆవిడ విసుక్కొంటోంది... పుట్టింటికి వెళ్ళిపోతానంటోంది. ఏం చెయ్య మంటారు"?

అలాంటి 'ప్రశ్న'ని అప్పటికి కొన్ని వేలసార్లు చదివుంటాను.

'మీ సమస్య ఏమోగాని మీ అడ్రస్ ఇస్తే మీ ఆవిడ సమస్యని తీర్చ గలను' అని జవాబిచ్చుంటె అలాంటి ప్రశ్నలు ఇంకరావు... మరి శీర్షిక నడవాలి కాబట్టి తిమిరంగారు అప్పటికి కొన్ని లక్షసార్లు చదివిన జవాబునే ఇచ్చారు.

పేజీ తిప్పాను.

'ఆర్చేవాళ్ళా?.. తీర్చేవాళ్ళా?' శీర్షిక క్రింద ఒక ప్రముఖ రచయిత్రి రకరకాల సమస్యలకి, జీ.కే.కి సంబంధించిన వివరాలతో సహా సమాధానాలిస్తూ ఉంటారు.

"మా నాన్న త్రాగుబోతు... ఇంటికి జీతం ఇవ్వడు.. నాకు చదువు అబ్బలేదు, బలాదూర్‌గా ముగ్గురు చెల్లెళ్ళు పెళ్ళికెదిగి కూర్చొన్నారు. నాకు ఉద్యోగం లేదు. అమ్మ ఏడుస్తోంది". ఏం చెయ్య మంటారు"? అని ఓ పాఠకుడు వాపోయాడు.

"ఆత్మ విశ్వాసంతో, ధైర్యం కోల్పోకుండా రిక్షా


కొత్తమాసు షాపింగ్ మాల్

హిందూ కాలేజ దగ్గర, కాంగ్రెస్ ఆఫీస్ ప్రక్కన, గుంటూరు. ఫోన్ : 5588881



కాలంతో పోటీపడే మీ పని వత్తిడి
వేగంతో కూడిన సమర్థతనే కోరుకుంటే...
అన్నీ ఒకేచోట దొరికే
'కొత్తమాసు షాపింగ్ మాల్'కి విచ్చేయండి.
ఆనందానుభూతులు కలిగించే
అంతర్జాతీయ షాపింగ్ అనుభవానికి
శ్రీకారం చుట్టండి.
టూ / ఫోర్ వీలర్స్‌కు సెల్లార్ పార్కింగ్ సౌకర్యం కలదు.

త్రొక్కితే అచిరకాలంలోనే లక్షాధికారి కావడం తథ్యం" అని ఆవిడ ధైర్యాన్ని నూరిపోసింది. ఏం చేస్తుంది? పాపం ! "కట్టకట్టుకొని గంగలో దూకండి" అనలేదు... అనకూడదు సుమతీ భండారుగారు.

మరో పేజీ త్రిప్పాను.

"బ్రెస్ట్ క్యాన్సరు... నివారణ"

అప్పటికి కొన్నివందలసార్లు వివిధ పత్రికలలో చదివాను. ఆ వ్యాసాన్ని...

రకరకాల క్యాన్సర్లు ఉండగా "బ్రెస్ట్ క్యాన్సర్" గురించే పత్రికలు ఎందుకు ఎక్కువగా వ్రాస్తాయి?

ఎందుకేమిటి?

"బ్రెస్ట్‌ల" ఫోటోలు వేసుకొన్నా తప్పులేదు... అశ్లీలం అవ్వదుగా... మెడికల్ ఇన్ఫర్‌మేషన్... మరి...

మరో పేజీ...

ప్రముఖ రచయిత సీరియల్.... 'భూతవైద్యం' సబ్జెక్ట్. ఇదివరకు కథకు కథే సబ్జెక్ట్‌గా ఉండేది.. వేరే సబ్జెక్ట్ ఉండేది కాదు. కేవలం మానవ జీవితం, సంఘం, మనిషి ఆలోచనలు.. మంచివి, చెడువి... వాటి పరిణామాలతో మలుపులు తిరుగుతూ కంచికి చేరుకొనేది. ఎవరో మహానుభావుడు సెలవిచ్చాడుట... "ప్రపంచం మొత్తం మీద ఏడంటే ఏడే కథలు ఉన్నాయి. అవి ఎప్పుడో వచ్చేసాయి" అని. అందుకే ప్రస్తుత రచయితలకు ఏం రాయాలో తెలియక ఏదో ఒక ఇన్‌ఫర్‌మేషన్‌ని తీసుకొని దాని చుట్టూ కథ అల్లి వదులుతున్నారు... ఏం చదవాలో తెలియని పాఠకులు వాటినే చదువుతున్నారు.

ఇక సంపాదకీయం...

లోపలి పేజీలకు భిన్నంగా ఉదాత్తంగా ఉంది.

ఆఖరు పేజీ...

"మీరే అడుక్కోండి.... మీరే చెప్పుకోండి" శీర్షిక

అత్యంత దురదృష్టవంతుడైన ఎయిడ్స్ రోగి ఎవరు?

'సుఖపడటం వల్ల కాక రక్తమార్పిడి వలన ఎయిడ్స్ రోగం తెచ్చుకున్నవాడు' అని అడుక్కొని, బదులిచ్చు కొన్నాడో పాఠకుడు.

పత్రిక మూసివేసి ప్రశాంతంగా పడుకొన్నాను. సీరియల్స్ అన్నీ అయిపోయాక టీ.వి. కట్టేసి వచ్చి పడుకుంది శ్రీమతి. ఆవిడ హీరోయిన్ల కష్టాలకు నిట్టూరుస్తూ...

\- - -

తెలివి వచ్చేసరికి ప్రక్కగదిలో లైటు వెలుగుతోంది... పిల్లలు చదువుకొంటున్నారు. వెళ్ళికూర్చున్నాను ప్రక్కన. ఆ రోజు తెలుగులో యూనిట్ పరీక్షట.

'యీ చాప్టర్స్‌లోంచి మీనింగ్స్, క్వొచ్చెన్స్ అడుగుతావా డాడీ' అడిగాడు బాబు.

రోజు మొత్తంలో చేసే మంచి పని ఇంతకన్నా ఇంకేముంటుందనుకొని 'అలాగేనాన్నా' అని పుస్తకం తీసుకొన్నాను.

నాలుగైదు ప్రశ్నలు అడిగాను. జవాబులు చెప్పాడు సరిగ్గానే..

అర్థాలలోకి వెళ్ళాను.

'ఉద్యానము' అడిగాను.


'పార్క్' జవాబిచ్చాడు.

నాకు కోపం వచ్చి... తెలుగు... తెలుగులో చెప్పాలి గద్దించాను.

'పార్కే నాన్నా... కావాలంటే చూసుకో' వాడికీ విసుగుకి తక్కువేం లేదు.

**'అర్థాలు'**లో పార్కుకి అర్థం చూశాను.

కళ్ళునులుముకొని, నీళ్ళతో మొహం కడుక్కొని, గిల్లుకొని మరీ చూశాను.



వాడు చెప్పింది కరక్టే...
'ఉద్యానవనం = పార్క్".... ఇలాగే ఉంది.
అదీ రాష్ట్రప్రభుత్వం ముద్రించిన తెలుగు వాచకంలో???
చాలాసేపు మౌనంగా ఉండిపోయాను..
"నేను చెప్పానా? అసలు నీకే తెలుగురాదు"
మా వాడు ఏవేవో అంటూ నోట్సు తీసి చదువుకోసాగాడు.
అది తప్పు అని చెప్పినా వాడు నమ్మడు, ఎందుకంటే నేనూ ఎప్పుడు వాడిని ఫలానా రాజీవ్ గాంధీ ఉద్యానవనానికో మరో దానికో తీసుకు వెడతానని ఎప్పుడూ చెప్పలేదు. పార్కుకి వెళదామనే అనేవాడిని. ఆఖరికి నాడి టెక్ట్సుబుక్‌లో కూడా అదే ఉంది...
సో.... హి ఈజ్ రైట్......

చాలా సేపు అలా ఆలోచిస్తూ... కూర్చుండి పోయాను. వినోదాన్ని, విజ్ఞానాన్ని, ఆహ్లాదాన్ని అనుభవించాలంటే... రానున్న రోజులలో అసంభవం అయిపోతుందేమోనన్న వాస్తవం.. ఆద మరిచి నిద్రిస్తున్న పిల్లలని చూస్తుంటే మరింత ఎక్కువవుతోంది. ఏది ఏమైనా... తన వరకైనా తన కుటుంబానికి మంచి కాలక్షేపాన్ని ఏర్పాటు చేయా లనుకుంటూ నిద్రకుపక్రమించాను. ❖

**రైల్వేలో ఉద్యోగం, సమాజాన్ని తన దృష్టితో చూడడం, స్పందించిన ఘనతకి అక్షర రూపాన్ని వ్వడం, మానవ సంబంధాల నేపథ్యాలతో అల్లిన నవల 'ఊరుపొమ్మంటోంది' స్వాతి మాసపత్రిక ఉత్తమ నవలగా అవార్డు పొందడం, హిపోక్రసీ లేని సాహిత్య వ్యవసాయం పొన్నాడ వారి ప్రత్యేకత.** ❖

(మినీకథ)

# ప్రేమ

- శైలజామిత్ర

నిజమే... ఈ రోజు వస్తున్న సినిమాలు యువ తరానికి ఏ మాత్రం ఉపయోగకరంగా లేవు. ప్రేమ, ప్రేమ అంటూ పెడదోవ పెట్టిస్తున్నారు. ప్రేమ అనేది జీవితంలో ఒక భాగం కావాలే తప్ప ప్రేమే జీవితం కాకూడదు. ఛి... ఛీ... పసిపిల్లల్ని అర్థనగ్న దృశ్యా లతో రెచ్చగొట్టే ప్రయత్నాన్ని మనం రూపుమాపాలి. ఒకప్పుడు సమాజానికి, వినోదానికి ఉపయోగపడే సినిమాలు నేడు పిల్లల భవిష్యత్తును అంధకారంలోకి తోస్తున్నాయి. అంటూ ఆవేశంగా చమటలు పట్టేలా అరచి మరీ చెప్పారు సెన్సారు బోర్డు మెంబరు సరస్వతి....

మేడమ్ సరస్వతిగారు.. సమాజంపట్ల సినిమాల వైఖరిని గూర్చి అందరికీ తెలియజెప్పి, ఎంతో ఆవేదన చెందారు. ఒక విధంగా వీటిని అరికట్టే ధైర్యం, బాధ్యత వారికి ఉన్నాయి. మనకోసం, నేటి యువతరం కోసం... సాయశక్తుల కృషిచేస్తారని, అందుకు సహాయం కావాలంటే మా కావ్య సంస్థ.. ఎల్లప్పుడూ ముందుంటుందని... తెలియజేసు కొంటూ సభ ముగిసిందని తెలియజేస్తున్నాము... అంటూ కార్యసంస్థ అధ్యక్షులవారు శ్రీనివాస్ తెలిపారు.

\- - -

"అబ్బ... అదరగొట్టావ్‌లే.. సరసూ.. నీ స్పీచ్... రియల్లీ వండర్.. రేపు పేపర్‌లో నీదే హైలైట్ అవుతుందేమో...." అంది కీర్తి నవ్వుతూ...

"అవ్వాలి... అందుకేగా నేమాట్లాడింది... సరే... అనుకొన్నదానికంటే ముందుగానే మీటింగ్ పూర్త యింది.... లంచ్‌చేసి డిస్పర్స్ అయిపోదామా!
అంది రిలాక్సింగ్‌గా వెనక్కు వాలుతూ... సరస్వతి..
"ఏం ఏదయినా పనుందా?"
"పనా... ఏంలేదే... ఏం అలా అడిగావు?"
"ఏంలేదు పిక్చర్‌కు..... అదీ లేడీ ఓరియంటెడ్... వచ్చిందిగా..
"కర్తవ్యం"లానే ఉందట.. వెళదామా?....
అడిగింది కీర్తి...
"ఛీ... అలాంటి సినిమాలకు నేను వెళ్ళలేను తల్లీ..
'నీకో నమస్కారం'
'సంధ్య'లో అదరగొట్టే ప్రేమ సినిమా ఆడుతోందట' దానికైతే రడీ... అంది హామీ ఇస్తూ... సరస్వతి రిలాక్సింగ్‌గా.... ❖